క్లుప్తంగా

చైతన్య మూర్తి సావిత్రీబాయి పూలే



సావిత్రీబాయి పూలే చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): మహిళల విద్య కోసం నిరంతరం పోరాటం చేసిన చైతన్య మూర్తి సావిత్రీబాయి పూలే అని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మలమ్మ అన్నారు. శనివారం ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బాలిక సంక్షేమ వసతి గృహంలో సావిత్రీబాయి పూలే జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సోషల్ మీడియా–డ్రగ్స్ ప్రభావం–విద్యార్థుల కర్తవ్యం అంశంపై సదస్సును నిర్వహించారు. సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు, ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి ఉదయ్, హాస్టల్ వార్డెన్‌లు బెన్నమ్మ, రజని పాల్గొన్నారు.

7న నిరసన తెలిపేందుకు తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న జే లలితమ్మ

కర్నూలు(సెంట్రల్): దేశంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ స్కీం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు లలితమ్మ, రమేష్‌బాబు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మునెప్ప, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి రబీజాబీ డిమాండ్ చేశారు. శనివారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ 7న జాతీయ నిరసనకు పిలుపు ఇచ్చినట్లు చెప్పారు. ఈకార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని మండలాలు, మునిసిపల్ కేంద్రాల్లో విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, వెంకటేష్, అంజి పాల్గొన్నారు.

వలంటీర్లను కొనసాగించండి



సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం ఇస్తున్న వలంటీర్లు

కర్నూలు (టౌన్): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమను కొనసాగించాలని 48వ వార్డు పరిధిలోని 124 సచివాలయాల వలంటీర్లు సుమలత, రాణమ్మ, రుక్సానా, నూర్జహాన్ శనివారం స్థానిక రోజా వీధిలోని సచివాలయంలో సచివాలయ అడ్మిన్ లావణ్య కు వినతిపత్రం అందజేశారు. వలంటీర్లను కొనసాగించడంతోపాటు వేతనం రూ.10 వేలకు పెంచుతామని ఓట్లు వేయించుకున్న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి పదవి చేపట్టి 7 నెలలవుతున్నా తమను విధుల్లోకి తీసుకోకపోవడం అన్యాయమన్నారు. వెంటనే తమను విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలి

కర్నూలు (టౌన్): క్రీడాకారులు అంకితభావం, స్నేహభావంతో పోటీల్లో పాల్గొంటేనే విజేతలుగా నిలుస్తారని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. శనివారం దిన్నెదేవరపాడు సమీపంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కబడ్డీ అభివృద్ధికి ఎంతో కృషి చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ఒలింపిక్ సంఘం అధ్యక్షులు పురుషోత్తం మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. విద్యుత్ లైట్ల కాంతుల్లో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేఈ జగదీష్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు రెండు డిపాజిట్ పథకాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఖాతాదారుల కోసం హర్‌ఘర్ లఖ్‌పతి, ఎస్‌బీఐ ప్యాట్రన్స్ పేర్లతో రెండు కొత్త డిపాజిట్ పథకాలను అమల్లోకి తెచ్చినట్లు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా కలెక్టరేట్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సీవీఆర్ ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ హర్‌ఘర్ లఖ్‌పతి అనేది నిర్ణయించిన కాలపరిమితికి చేసుకునే రికరింగ్ డిపాజిట్ స్కీమ్ అని, ఇందులో రూ.లక్ష అంతకంటే ఎక్కువ మొత్తంలో డిపాజిట్ చేయవచ్చన్నారు. ఈ పథకానికి మైనర్లు కూడా అర్హులేనన్నారు. 7 రోజుల నుంచి 45 రోజులకు 4 శాతం, 46 రోజుల నుంచి 179 రోజుల వరకు 6 శాతం, 180 రోజుల నుంచి 210 రోజులకు 6.75 శాతం, 211 రోజుల నుంచి ఏడాది కంటే తక్కువ రోజులకు 7 శాతం, ఏడాది నుంచి రెండేళ్ల కంటే తక్కువ రోజులకు 7.3 శాతం ప్రకారంవడ్డీ లభిస్తుంది. 80 ఏళ్ల పైబడిన వారికి ఆకర్షణీయమైన వడ్డీ రేట్లతో ఎస్‌బీఐ ప్యాట్రన్స్ ప్రత్యేక టర్మ్ డిపాజిట్ పథకం ప్రారంభించామన్నారు.

‘మధ్యాహ్నం’ గందరగోళం

- జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం
- కుకింగ్ కమ్ హెల్పర్స్‌ను నియమించక పోవడంతో గందరగోళం
- వంట చేసేందుకు పోటీ పడిన ఏజెన్సీలు
- మొదటి రోజు 70 శాతం మందికే భోజనం

కర్నూలు సిటీ: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్, ఒకేషనల్, ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ప్రారంభించారు. 23 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, 3 హైస్కూల్ ప్లస్, 16 ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీల్లో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ముందస్తు కసరత్తు లేకుండా పథకాన్ని ప్రారంభించడంతో మొదటి రోజు కొన్ని కాలేజీల్లో విద్యార్థుల సంఖ్యకు తగ్గ భోజనాన్ని అందించలేకపోయారు. తాగేందుకు నీటిని అందుబాటులో పెట్టకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పథకాన్ని అమలు చేసేది పాఠశాల విద్యశాఖ కావడంతో ఇంటర్మీడియెట్ జూనియర్ కాలేజీలకు చెందిన ప్రిన్సిపాళ్ల మధ్య సరైన సమన్వయం లేక గందరగోళం తలెత్తింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 8,537 మంది విద్యార్థులు ఉండగా మొదటి రోజు 70 శాతం మందికి మాత్రమే మధ్యాహ్న భోజనాన్ని అందించారు.

– కర్నూలు నగరంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ(టౌన్ మోడల్)లో సుమారుగా 1,125 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 788 మందికి మాత్రమే మధ్యాహ్న భోజనాన్ని అందించాలని నిర్ణయించారు. వీరికి భోజనం చేసేందుకు వంట ఏజెన్సీ విషయంలో వివాదం నెలకొంది. ఓ మంత్రి సిఫారసుతో ఓ ఏజెన్సీకి అప్పగించేందుకు విద్యాశాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆ స్కూల్ కాంపౌండ్‌లోని వారితోనే వంట చేయించుకుంటామని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ చెప్పారు. ఆ తరువాత మంత్రి ఆదేశాలతో ఆ ప్రిన్సిపాల్ వెనక్కి తగ్గి శుక్రవారం రాత్రి ఉదయం వంట చేయండని విద్యాశాఖ నిర్ణయించిన ఏజెన్సీ వారికి సూచించారు. కానీ ఉదయం కాలేజీలోకి భోజనం చేసేందుకు రాగా వారిని, ఆ కాలేజీ కాంపౌండ్‌లోని ఏజెన్సీ వారు భోజనం తయారు చేయనివ్వకుండా అడ్డు తగలడంతో వివాదంగా



టౌన్ మోడల్ కాలేజీలో భోజనాన్ని వడ్డిస్తున్న కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు

మారింది. చివరికి పోలీసులు రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకే కాలేజీకి చెందిన విద్యార్థులను రెండు ఏజెన్సీలతో ప్రిన్సిపాల్ వంట చేయించి భోజనం పెట్టించారు. దీనిపై విద్యాశాఖ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలేజీలో ప్రారంభోత్సవానికి కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు హాజరై ప్రారంభించారు. అలాగే కేవీఆర్ జూనియర్ కాలేజీలో కూడా వంట ఏజెన్సీ విషయంలో కొద్దిసేపు వివాదం నడిచింది. ప్రిన్సిపాల్ తమకు సంబంధం లేదని పాఠశాల విద్యాశాఖ నియమించిన ఏజెన్సీతోనే భోజనం చేయించుకుంటామని చెప్పడంతోపాటు వివాదం చేస్తే ఉన్నతాధికారులు, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని హెచ్చరించడంతో సమస్య సద్దుమణిగింది.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



క్రీడా జ్యోతి వెలిగించి స్పోర్ట్స్ మీట్ ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని వైఎస్సార్‌సీపీజిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఏపీఎస్పీ రెండవ బెటాలియన్ క్రీడా మైదానంలో పీస్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడా పోటీలను ప్రారంభించి ప్రసంగించారు. పోటీ ప్రపంచంలో చదువుతోపాటు క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఏపీఎస్పీ అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చాటితే పోలీసు ఉద్యోగాల ఎంపికల్లో చక్కగా రాణిస్తారన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఎండీ నాసిర్, పత్తాబాషా, కిషన్, రాజశేఖర్, అశోక్, మునీర్ బాషా, బుల్లెట్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కంది పంట దగ్ధం

- మంటలను ఆర్పే క్రమంలో ప్రమాదానికి గురైన రైతు



తగలబడుతున్న కంది పంట

కృష్ణగిరి: ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని ఆరు ఎకరాల కంది పంట దగ్ధమైన సంఘటన మండలంలోని బోయబొంతిరాళ్ల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన హరిజన గాడుదుల రంగన్న తనకున్న మూడు ఎకరాలకు తోడుగా మరో ఆరు ఎకరాలను కౌలుకు తీసుకుని జీవనం సాగిస్తున్నాడు. కౌలుకు తీసుకున్న పొలంలో కంది పంట సాగు చేశాడు. పంట చేతికి రావడంతో వారం కిందట కూలీలతో కోయించాడు. శనివారం రోజు కందికట్టెను టార్పిళ్లపైకి చేర్చాడు. పంటను మిషన్‌తో నూర్పిడి చేసుకుని కౌలు చెల్లించుకోవాలనుకున్నాడు. ఇంతలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో క్లోదుటే పంట కాలిపోతుంటే కాపాడేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రయత్నించాడు. సమాచారం అందుకున్న గ్రామస్తులు బిందెలతో నీటిని తెచ్చి ఆర్పేందుకు ప్రయత్నించినా గాలి ప్రభావం ఎక్కువగా ఉండటంతో కాలి బూడిదైంది. దీంతో రైతు కన్నీరుమున్నీరయ్యాడు. సుమారుగా పది ఎడ్ల బండ్ల కంది పంట కాలిబూడిదై రెండున్నర లక్షల వరకు నష్టపోయానని విలపించాడు. ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ రవిమోహన్, గ్రామస్తులు కోరారు.

యమడేంజర్!



ఒరిగిన విద్యుత్ స్తంభం పక్కనే రోడ్డు పనులు చేస్తున్న హిటాచీ

కర్నూలు(రూరల్): మండల పరిధిలో గార్గేయపురం నుంచి పసుపల మార్గంలో విద్యుత్ స్తంభాలు ఒరిగి, తీగలు వేలాడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. శనివారం రోడ్డు పనుల్లో భాగంగా ఒరిగిన విద్యుత్ స్తంభం వద్ద హిటాచీతో మట్టి చదును చేపట్టడంతో స్తంభం ఎక్కడ పడిపోతుందోనని, తీగలు తగులు తాయే మోనని వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. విద్యుత్ అధికారులు స్పందించి ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలని కోరుతున్నారు.

ఘనంగా క్రెడో ది స్కూల్ వార్షికోత్సవం



సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారులు

కర్నూలు సిటీ: నగర శివారులోని క్రెడో ది స్కూల్ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, తాలూకా సీఐ శ్రీధర్‌లు పాల్గొని వేడుకలను ప్రారంభించి ప్రసంగించారు. పాఠశాల విద్యను అభ్యసించే సమయంలో నుంచే క్రమశిక్షణ అనేది చాలా ముఖ్యమన్నారు. నిత్యంతో చదువుతోపాటు ఆటలు ఆడించాలన్నారు. ఉన్నత చదువులకు స్కూల్ ఎంపిక అనేది చాలా కీలకమన్నారు. గొప్ప లక్ష్యాలతో చదివితే అదే స్థాయిలో ఫలితాలు ఉంటాయన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న వారందరు అదృష్టంగా భావించాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు కార్తీక్, శ్రావ్య పాల్గొన్నారు.

ఇంటి స్థలం హామీని నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న ఎస్.మునెప్ప

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు పేదలకు ఇంటి స్థలం ఇస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు గ్రామీణ ప్రాంతాల వారికి మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల వారికి 2 సెంట్ల స్థలం ఇస్తానని మాట ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత హామీపై మాట్లడడం లేదన్నారు. నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కర్నూలు నగరంలో పెరిగిపోతున్న ట్రాఫిక్ నియంత్రణకు కొత్తబస్టాండ్, హాస్పిటల్ సమీపాల్లో ఫ్లైఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలన్నారు. హంద్రీ నీరు ఇళ్లలోకి రాకుండా రక్షణ గోడ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిన జిల్లా వాసులు



ఆహార పదార్థాల ప్యాకెట్లను కార్యకర్తలు అందజేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: విజయవాడలో ఆదివారం నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగ సభకు జిల్లా నుంచి వేలాది మంది హిందువులు తరలి వెళ్లారని వీహెచ్‌పీ నాయకులు పేర్కొన్నారు. శనివారం వీహెచ్‌పీ కార్యాలయంలో బహిరంగ సభకు వెళ్లే నాయకులు, కార్యకర్తలకు రవాణా ఖర్చు, స్నాక్స్ తదితర వాటిని ఆవోపా చీఫ్ కన్వీనర్ నాగేశ్వరరావు వీహెచ్‌పీ నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా బజరంగ్ దల్ నాయకులు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ సనాతన ధర్మ, హిందూ ధర్మ పరిరక్షణకు భారీ బహిరంగ సభను విజయవాడలో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా నుంచి వీహెచ్‌పీ, బీజేపీ, బజరంగ్ దల్, ఆర్‌ఎస్‌ఎస్, మాతృ మండలి, వాసవీ సేవాదల్, ధార్మిక సంస్థల కార్యకర్తలు భారీ తరలి వెళ్లారన్నారు.

పోలీసులు మీడియా స్వేచ్ఛను అణచివేస్తున్నారు

- సీఎస్‌కు ఫిర్యాదు చేసిన ఏపీడబ్ల్యూజేఎఫ్



సీఎస్ విజయానంద్‌కు ఫిర్యాదు చేస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో పోలీసులు మీడియా స్వేచ్ఛను అణచివేస్తున్నారని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గోరంట్లప్ప, జిల్లా కన్వీనర్ కె.నాగేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కర్నూలుకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) విజయానంద్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఇటీవల కర్నూలు సాక్షి రిపోర్టర్‌పై కేసు పెట్టడం, వార్త, ప్రజాశక్తి రిపోర్టర్లకు పోలీసులు నోటీసులు ఇవ్వడాన్ని వారు సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. పోలీసుల చర్యలతో మీడియాప్రతినిధులు భయభ్రాంతులకు గురవుతున్నారని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని వారు సీఎస్‌ను కోరారు.

శివారు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు



వాసవీ నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగర పరిధిలోని శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు అన్నారు. శనివారం పెద్దపాడు, ఎ.నాగులాపురం, వై.జంక్షన్, బి.క్యాంపు, సీ.క్యాంపు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రహదారుల నిర్మాణం, సీ.క్యాంపులోని నగరపాలక వ్యాపార సముదాయంలో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు మరింత మెరుగుపరచాలన్నారు. బి.క్యాంపులో స్పీడ్ బ్రేకర్లు ప్రజలకు కనబడే విధంగా సింబల్స్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, డీఈఈ క్రిష్ణలత, మనోహర్ రెడ్డి, భానుప్రతాప్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అంజాద్‌బాషా పాల్గొన్నారు.

– మునగాల పాడులోని తాగునీటి సరఫరా పంపింగ్ కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట డీఈఈ నరేష్, ఏఈ ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఉన్నారు.

విద్యార్థినులకు రక్షణ కల్పించాలి



సమస్యను సీఎస్‌కు వివరిస్తున్న ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కర్నూలు సిటీ: బనవాసి బాలికల గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు రక్షణ కల్పించాలని కోరుతూ ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు వినతి పత్రం అందజేశారు. విద్యార్థినుల పట్ల లైబ్రేరియన్ మద్దిలేటి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని, అలాగే మరికొందరు అధ్యాపకులు కూడా తాము చెప్పినట్లు వినకపోతే ప్రాక్టికల్‌లో ఫెయిల్ చేస్తామని విద్యార్థినులను వేధిస్తున్నారని వారు సీఎస్‌కు ఫిర్యాదు చేశారు. రాత్రి స్టడీ క్లాస్‌లకు నైటీలు వేసుకు రావాలని, కలర్ డ్రెస్సులు వేసుకుని కలర్‌ఫుల్‌గా కనపడాలని లెక్చరర్ శ్రీధర్ అసభ్యకరంగా వ్యవహరిస్తున్న విషయాన్ని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గుప్త దృష్టికి విద్యార్థినులు తీసుకెళ్లినప్పటికీ ఏమాత్రం పట్టించుకోకపోగా ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకురాలు సునిత, ఈడీ సుకన్య విద్యార్థినుల పట్ల దురుసుగా మాట్లాడుతున్నారని వివరించారు. విచారించి వారందరినీ శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తొలగించి పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేయాలని కోరారు. స్కూల్‌లో సీసీ కెమెరాలు పనిచేసేలా ఏర్పాటు చేసి అక్కడ మహిళా అధ్యాపకులను నియమించాలని విన్నవించారు. స్పందించిన సీఎస్.. ట్రైనీ కలెక్టర్ చేత విచారణ చేయించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఐద్వా జిల్లా నాయకులు శ్యామల, ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి సాయి, ఆర్యన్ ఉన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



డ్రమ్ములో నీటిని పరిశీలిస్తున్న జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మానాయక్

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు తమ ఇల్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు రాకుండా ఉంటాయని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మ నాయక్ చెప్పారు. శనివారం ఆయన స్థానిక డాక్టర్స్ కాలనీలోని యూపీహెచ్‌సీ పరిధిలో ఉన్న ఆరోరా నగర్‌లో సందర్శించి డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, అనారోగ్యం సోకిన తర్వాత ఇబ్బంది పడటం కన్నా ముందు జాగ్రత్తలు పాటించడం మేలని సూచించారు. వైరస్‌తో చికున్‌గున్యా వ్యాధి దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. తలనొప్పి, వాంతులు, వికారంతో హఠాత్తుగా వచ్చే జ్వరం, చేతి వేళ్లు, కాళ్ల నుంచి మొదలుకొని శరీరంలోని అన్ని కీళ్లను బాధిస్తుందన్నారు. కీళ్లనొప్పుల వల్ల సరిగ్గా నిలబడలేని పరిస్థితి ఏర్పడుతుందని, జ్వరం తగ్గినా ఈ నొప్పులు మాత్రం ఎక్కువ కాలం ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల కుమారి, సహాయ మలేరియా అధికారి చంద్రశేఖర్, ఎంటమాలజిస్టు వెంకటేశ్వర్లు, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తున్న ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ అధ్యక్ష, కార్యదర్శులు వై.నగేష్, రాఘవేంద్ర డిమాండ్‌చేశారు. శనివారం డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కర్నూలు మండలం ఉల్చాలలో అక్రమంగా బెల్ట్ షాపును నిర్వహిస్తున్నారని, ఈవిషయాన్ని స్వయంగా గత నవంబర్ 24న ఎక్సైజ్ అధికారులకు ఆధారాలతో సహా తెలిపినా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే ఆందోళన బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

మొబైల్ రైతుబజారుకు విశేష స్పందన

కర్నూలు(అగ్రికల్చర్): వినియోగదారుల సౌకర్యార్థం అమలు చేస్తున్న మొబైల్ రైతు బాజరుకు విశేష స్పందన లభించింది. మార్కెటింగ్ శాఖ శనివారం నంద్యాల చెక్ పోస్టు, అరోర నగర్ కాలనీల్లో సంచార రైతుబజారు వాహనం ద్వారా వినియోగదారులకు తాజా కూరగాయలు అందుబాటులోకి తెచ్చింది. రైతుబజారులో ధరల కంటే కిలోపై రూ.2 ప్రకారం ఎక్కువ ధరలకు కూరగాయలు విక్రయించారు. రెండు క్వింటాళ్లకుపైగా కూరగాయలు సంచార రైతుబజారు ద్వారా వినియోగదారులకు అందజేశారు. మొబైల్ రైతుబజారు తమ ఏరియాకు రావాలని కోరుకునే వారు 90009 46607కు ఫోన్ చేయాలని హార్టికల్చర్ కన్సల్టెంట్ శివకుమార్ తెలిపారు.

టీకాలతో వ్యాధుల నుంచి రక్షణ

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, చిన్నారులకు సమయానుసారం టీకాలు వేయిస్తే వారికి భవిష్యత్‌లో ప్రాణాంతక వ్యాధులు రాకుండా కాపాడవచ్చని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు చెప్పారు. శనివారం స్థానిక బండిమెట్ట యూపీహెచ్‌సీ పరిధిలోని మొగల్పుర 6వ సచివాలయంలో వ్యాధినిరోధక టీకాల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ పిల్లలకు ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే పట్టించాలని, ఏడవ నెల నుంచి అనుబంధ ఆహారం తినిపించాలని సూచించారు. వాతావరణంలో మార్పుల వల్ల చలితీవ్రత ఎక్కువగా ఉన్నందున పిల్లలకు న్యూమోనియా నుంచి రక్షణ కోసం వెచ్చగా ఉండేటట్లు దుస్తులు వేయాలని చెప్పారు. పిల్లలకు ఏదైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆరోగ్య కార్యకర్త, డాక్టర్ వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి, ఆరోగ్య కార్యకర్తలు నాగరాణి, వెంకటలక్ష్మి, ఆశా కార్యకర్తలు సవిత, రాజేశ్వరి పాల్గొన్నారు.

రేపు టెన్నికాయిట్ జట్ల ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక గుత్తి పెట్రోల్ బంకు వద్ద ఉన్న ఓరియంట్ ఇంగ్లీషు మీడియం స్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 6న జిల్లా స్థాయి జూనియర్స్ బాలబాలికల టెన్నికాయిట్ జట్ల ఎంపిక పోటీలు ఉంటాయని టెన్నికాయిట్ జిల్లా కార్యదర్శి రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2006 తరువాత జన్మించిన వారు అర్హులని, ఆసక్తి ఉన్న క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 93938401721 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు మహిళలకు ఉచిత వైద్యశిబిరం

కర్నూలు(హాస్పిటల్): మహిళలకు ఈనెల 5న ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్ క్లబ్‌లో ఉదయం 8 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందన్నారు. శిబిరానికి వచ్చిన మహిళలకు బీపీ, ఈసీజీ, బ్లడ్‌షుగర్ పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తామన్నారు.

సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ కింద 36 గ్రామాలకు తాగునీరు

నంద్యాల(అర్బన్): మండలంలోని అబాండం తండా గ్రామ సమీపంలో ఉన్న సీపీడబ్ల్యూఎస్ (సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం) ద్వారా నంద్యాల నియోజకవర్గంలోని 36 గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామని కర్నూలు జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి తెలిపారు. పథకం కింద జరుగుతున్న పనులు, తాగునీటి సరఫరాను శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవికుమార్, ఏఈలు ప్రమోద్, మురళీనాయక్‌తో పాటు ఎంపీడీఓ సుగుణశ్రీ, పలు గ్రామాల సర్పంచ్‌లతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పైప్‌లైన్ డ్యామేజీ, నీటి సరఫరాలో అంతరాయాలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి గ్రామాల అభివృద్ధి, పింఛన్ల పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈఓఆర్‌డీ జ్యోతి, ఏఓ షాను పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

గడివేముల: మండల పరిధిలోని ఎల్ కే తండా, వైకే తండా గ్రామాల సమీపంలోని ఎర్రమల కొండలలో నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఎక్సైజ్ సీఐలు కృష్ణమూర్తి, కృష్ణ శనివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 1300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేశారు. వారు మాట్లాడుతూ అక్రమంగా నాటు సారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాటు సారా అమ్మేవారు ఉంటే 80088 28467, 94409 02586 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. దాడుల్లో ఎస్ఐ బ్రహ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.